కుటుంబ నేపథ్యం | అమ్మ: కల్యాణి (గృహిణి) | నాన్న: జి.ఎస్.సర్కార్ (విశ్రాంత ఐపీఎస్) | భర్త: రోహిత్ ఝా (బ్యాంకు ఉన్నతోద్యోగి) | స్వస్థలం: పాట్నా, సమీపంలోని హాజీపూర్ (బిహార్) | అభిరుచి: చిత్రలేఖనం | ఆటలు: వాలీబాల్ ఆడటం ఇష్టం



కలెక్టర్ అభిలాష అభినవ్

కష్టపడి చదివితే.. ఇష్టమైన జీవితం

నిర్మల్, న్యూస్‌టుడే: ఇలా చదువు పూర్తికాగానే అలా కొలువు రావాలని అందరూ కోరుకుంటారు. ఒకటి, రెండు ప్రయత్నాలు విఫలమైతే నిరాశ పడతారు. ఇక తమతో కాదులే అని నిరాసిస్తారు. కొద్దిపాటి ప్రయత్నంతో ఏదో ఒకటి వచ్చింది చాలులే అని సరిపెట్టుకుంటారు. కానీ చాలా కొద్ది మంది మాత్రమే మొక్కవోని దీక్షతో అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చుకునేందుకు ప్రయత్నించి విజయం దక్కించుకుంటారు. అందులో ఒకరు నిర్మల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న అభిలాష అభినవ్. కష్టపడి చదివితే ఇష్టమైన జీవితం పొందవచ్చని తన స్ఫూర్తిదాయక జీవన ప్రయాణం గురించి ఆమె మాటల్లోనే..

అమ్మ ప్రోత్సాహంతో..

కలెక్టర్‌గా ప్రజలకు సేవ చేయాలని చిన్నప్పటి నుంచి లక్ష్యంగా పెట్టుకున్నా. పోటీ పరీక్షలు రాయడం.. సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవడం అలవడింది. ఐఏఎస్ కావడానికి అమ్మా నాన్న ఎంతో ప్రోత్సహించారు. 'కల'గన్న ఐఏఎస్ నెరవేర్చుకుని సంతోషంగా ఉన్నా. ఇది ఊరికే రాలేదు. చదువుకునే సమయంలో సరదాలకు దూరంగా ఉండి పుస్తకాలతో దోస్తీ పట్టా. కష్టపడి సాధించిన ఇష్టపడే పదవితో ఈ స్థానంలో ఉన్నా. ఇప్పుడు కలెక్టర్ హోదాలో ప్రజలకు అందిస్తున్న సేవలో ఆనందం కనిపిస్తుంది.

మానసికంగా దృఢంగా..

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత ఒత్తిడికి లోనుకావొద్దు. నిబద్ధత, క్రమశిక్షణతో చదవాలి. చాలా మంది సివిల్స్ రాసేందుకు ఇష్టమున్నా కష్టమని వెనక్కి తగ్గుతుంటారు. సరైన ప్రణాళికతో ముందుకుసాగితే అనుకున్న లక్ష్యం సాధించవచ్చు. ప్రధానంగా మానసికంగా దృఢంగా ఉండాలి. అపజయాలు ఎదురైనా కుంగిపోవద్దు. చదువుతో భవిష్యత్తు ఉంటుందన్న సంకల్పం బలంగా ఉంటే విజయం వరిస్తుంది.

పాఠశాలల్లోనే లక్ష్యంవైపు..

పాఠశాలల్లోనే కచ్చితంగా లక్ష్యం వైపు అడుగులు వేయాలి. ఈ దశలో ఏమి సాధించాలి. ఎటువైపు వెళ్లాలి అనే స్పష్టత ఉండాలి. మీ కల, లక్ష్యం సాధించాలంటే వీలైనంత ఉత్తమ ప్రదర్శన ఇవ్వాలి. ప్రయత్నంలో విఫలమైతే నిరాశ చెందొద్దు. సాధించాలనే సంకల్పం ఉండాలి. గొప్ప కలలు కనాలి. దాన్ని అందుకునేవరకు పట్టుదల వీడొద్దు.

ప్రయాణం ఇలా..

- 2012లో బీటెక్(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్) నవీ ముంబయిలోని ఎస్ఐఈఎస్ కళాశాలలో పూర్తి చేశా.
- పుణెలోని బీఎంవీలో రెండున్నరేళ్లు ఉద్యోగం చేశా. తర్వాత దిల్లీలోని సిండికేట్ బ్యాంకులో మేనేజరుగా పనిచేశా.
- 2014లో తొలిసారి సివిల్ సర్వీస్ పరీక్షలు రాసి విఫలమైనా నిరాశ చెందకుండా రెండో ప్రయత్నంలో 2016లో పట్టుదలతో చదివి 308 ర్యాంకు సాధించి ఐఆర్ఎస్(ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్)కు ఎంపికయ్యాను.
- నాగ్‌పూర్‌లో ఆదాయ పన్నుశాఖ అధికారిగా తొమ్మిది నెలలు పని చేశాను.
- 2017లో మూడోసారి సివిల్ సర్వీస్ పరీక్షలు రాసి జాతీయస్థాయిలో 18వ ర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపికయ్యాను.
- శిక్షణ పూర్తి చేసిన తర్వాత ఆగస్టు 2020లో మొదటిసారిగా మహబూబాబాద్ అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా, తర్వాత ఖమ్మం అదనపు పాలనాధికారి(స్థానిక సంస్థలు)గా, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) జోనల్ కమిషనర్‌గా పనిచేశాను.
- ఇప్పుడు కలెక్టర్ తొలి పోస్టింగ్ నిర్మల్ జిల్లాలో పనిచేయడం సంతోషంగా ఉంది.

గడ్డం వెంకటస్వామి సేవలు ప్రశంసనీయం

నిర్మల్, న్యూస్‌టుడే: దళిత, బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కేంద్ర మాజీ మంత్రి దివంగత గడ్డం వెంకటస్వామి ఎంతో కృషి చేశారని జిల్లా అదనపు పాలనాధికారి (రెవెన్యూ) కిశోర్‌కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. సీపీవో జీవరత్నం, జిల్లా యువజన, క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి, సంక్షేమ అధికారులు రాజేశ్వర్ గౌడ్, శ్రీనివాస్, అంబాజీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న జిల్లా అదనపు పాలనాధికారి (రెవెన్యూ) కిశోర్‌కుమార్, అధికారులు

అన్నదాత మురిసేట్టు.. అధికారుల కసరత్తు

సన్నాలకు ప్రత్యేక కొనుగోలు కేంద్రాలు

మంచిర్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే:

ఈ వానాకాలం నుంచే సన్న రకం వడ్లకు రూ. 500 బోనస్ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు పెద్ద మొత్తంలో వీటి సాగుపై దృష్టి సారించారు. గతంతో పోలిస్తే ఈసారి సాగు గణనీయంగా పెరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తకుండా.. అక్రమాలకు తావు లేకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దొడ్డు రకం కేంద్రాలతో పాటు ప్రత్యేకంగా సన్నాలకు విడిగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ముందుగా నాట్లు వేసిన చోట వరి పొలాలు గొలక దశలో ఉన్నాయి. ఇవి మరో 20 నుంచి 25 రోజుల్లో కోతకు వచ్చే అవకాశాలున్నాయి. మిగతా చోట్ల ఇప్పుడిప్పుడే పొట్ట దశలో ఉండగా ఇవి నెలన్నర నుంచి 50 రోజుల్లో కోతకు రానున్నాయి..

రైతులు పండించిన పంటకు మద్దతు అందించేందుకు ప్రభుత్వం వివిధ ఏజన్సీల ద్వారా గతంలో దొడ్డు రకం ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. సన్నరకం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో అయినకాడికి వ్యాపారులకే ధాన్యాన్ని అమ్ముకున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో సన్నాల సాగు పెరిగింది. బోనస్ ఇస్తుండటం.. సన్న ధాన్యం ఎక్కువ రానుండటంతో ఇందుకు అనుగుణంగా ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటుపై దృష్టి సారించారు. వచ్చే దిగుబడుల ఆధారంగా కేంద్రాల ఏర్పాటు నిర్ణయాధికారం ప్రభుత్వం కలెక్టర్లకు ఇవ్వడంతో స్థానికగా దిగుబడికి అనుగుణంగా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వచ్చే దిగుబడి అంచనాకు అనుగుణంగా కేంద్రాల ఏర్పాటుపై ప్రతిపాదనలు తయారు చేశారు.



దండేపల్లి శివారులో సాగవుతున్న సన్నరకం వరి

మద్దతు ఇలా...

- ప్రస్తుతం ప్రభుత్వ మద్దతు ధర 'ఏ' రకానికి రూ. 2,320 'బీ' రకానికి రూ. 2300 ధర ఉంది.
- రూ. 500 బోనస్ కలుపుకుంటే 'ఏ' రకానికి రూ. 2820, 'బీ' రకానికి రూ. 2,800 దక్కనుంది.

ఇబ్బందులు లేకుండా చర్యలు

మోతీలాల్, అదనపు పాలనాధికారి, మంచిర్యాల

ప్రభుత్వం సన్నాలకు మద్దతు ధరకు అదనంగా క్వింటాలుకు రూ. 500బోనస్ ప్రకటించినందున రైతులకు ధాన్యం కొనుగోళ్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేకంగా సన్నరకం కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దొడ్డు రకాలతో పాటు సన్నరకాల కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు అందేలా చూస్తాం. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

జిల్లాల వారీగా వరి దిగుబడి అంచనా (మెట్రిక్ టన్నుల్లో)

జిల్లా	సన్నాలు	దొడ్డు	ప్రతిపాదించిన కేంద్రాలు(దొడ్డు, సన్నం కలిపి)
మంచిర్యాల	2,10,000	1,00,000	326
నిర్మల్	85,000	60,000	260
కుమురం భీం	82,000	15000	34
ఆదిలాబాద్	1500	500	03

భక్తులకు ఇబ్బందులు లేకుండా బందోబస్తు

దిలావర్‌పూర్, న్యూస్‌టుడే: గంగనీళ్ల జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించాలని జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల అన్నారు. శనివారం మండలంలోని సాంగ్వీ గ్రామ శివారులోని అడెల్లి పోచమ్మ తల్లి ఆభరణాలను శుద్ధి చేసే గోదావరి నది తీరాన్ని, రాత్రి జాగరణ చేసే ఆలయ పరిసరాలను పరిశీలించి మాట్లాడారు. అమ్మవారి నగలను ఆదివారం అడెల్లి ఆలయ పూజారులు ఆలయానికి తీసుకెళ్లే సమయంలో బన్సపల్లి, దిలావర్‌పూర్, మాడేగాం గ్రామాల్లో వేలాది భక్తులు నగలను పూజించడం వారి ఆచారంలో భాగమని, పోలీసు సిబ్బంది అమ్మవారి నగలను మోయకుండా భద్రత మాత్రమే కల్పించాలని సూచించారు. అంతకు ముందు సాంగ్వీ పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్సై సందీప్ తదితరులు పాల్గొన్నారు.



సాంగ్వీ గోదావరి తీరంలో అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ డా.జానకి షర్మిల, డీఎస్పీ గంగారెడ్డి

ముగిసిన ధ్రువపత్రాల పరిశీలన

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: నిర్మల్ గ్రామీణ మండలం కొండాపూర్‌లోని సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన డీఎస్సీ- 2024 అభ్యర్థుల 1:3 ధ్రువపత్రాల పరిశీలన శనివారం ముగిసింది. స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, పీఈటీ, భాషాపండితులు 314 పోస్టులు భర్తీ చేసేందుకు 782 మంది అభ్యర్థులను అర్హులుగా గుర్తించి జాబితాను రాష్ట్ర ఉన్నతాధికారులు వెల్లడించారు. ఈ నెల 2న ప్రారంభమైన ప్రక్రియ కోసం నిపుణులైన ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులతో 12 పరిశీలన బృందాలను ఏర్పాటు చేశారు. మొత్తం 746 మంది హాజరు కాగా, 738 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేశారు. స్పెషల్ ఎడ్యుకేషన్ (ఎస్ఏ, ఎస్జీటీ) 28 పోస్టులకు సంబంధించి 1:3 జాబితా ఇంకా వెలువడలేదు. డీఎస్సీలో పేర్లు ఉండి, ఇటీవల వెల్లడించిన డీఎడ్ ఫలితాల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు అనుమతి ఇవ్వడంతో వారు కేంద్రానికి వచ్చి తమ ధ్రువపత్రాలను పరిశీలించుకున్నారని డీఈవో ఎ.రవీందర్‌రెడ్డి తెలిపారు.



పింజరిగుట్టలో కొలువైన శాంతి స్వరూపిణి



ప్రియదర్శినినగర్ లయన్స్ క్లబ్‌లో సింహంపై అష్టభుజ అమ్మవారు



ఆర్యవైశ్య సంఘంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అన్నపూర్ణ దేవీ.. దీవించు తల్లీ

నిర్మల్ జిల్లా కేంద్రంలో దుర్గా నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తున్నారు. తొమ్మిది రోజులు భక్తి శ్రద్ధలతో అమ్మవారి మాలలు ధరించి వాడవాడలో కొలువైన అమ్మవారి మూర్తులను అందంగా అలంకరించి పూజలు చేస్తున్నారు. నవరాత్రులలో భాగంగా మూడో రోజు అమ్మవారు అన్నపూర్ణ దేవీగా దర్శనమిచ్చారు. పలు మండపాల్లో అన్నదానాలు చేశారు.

- చిత్రాలు : న్యూస్‌టుడే, నిర్మల్

ఆర్జీయూకేటీ.. పర్యవేక్షణ కొరవడి

భద్రతాధికారుల పోస్టులు ఖాళీ

న్యూస్‌టుడే, ముథోల్(బాసర) :

బాసర ఆర్జీయూకేటీలో సుమారు 9 వేల మంది విద్యార్థులు, సుమారు రెండు వేల మంది వరకు బోధన, బోధనేతర సిబ్బంది ఉంటారు. ఆరువేల మంది విద్యార్థినిలుంటారు. వీరికి మౌలిక వసతులతో పాటు సాంకేతిక విద్యను అందిస్తూ వారికి అవసరమైన రక్షణను కల్పించాలి. రక్షణ కోసం సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఉండాలి. కానీ అక్కడ పర్యవేక్షణ చేసే అధికారుల పోస్టులు ఖాళీగా ఉండటంతో భద్రత ఆగమైంది. దీంతో గత నెల 25న ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థులు గోడ దూకి పారిపోయారు. గస్తీ తిరుగుతున్న పోలీసులు వారిని పట్టుకొని ఆర్జీయూకేటీ భద్రత సిబ్బందికి అప్పగించే వరకు ఈ విషయం వారికి తెలియదు.

జిల్లా పోలీసు అధికారికి అప్పగించాలి

బాసర ఆర్జీయూకేటీ భద్రతా అధికారులు, భద్రతా సిబ్బంది అంతా ఉపకులపతి ఆధీనంలో ఉంటారు. ఇన్‌ఛార్జి ఉపకులపతి వెంకటరమణ అప్పుడప్పుడు వస్తుంటారు. ఎక్కువ సమయం హైదరాబాద్‌లో ఉండటంతో భద్రత సిబ్బందిపై ఆయనకు అంతగా పట్టు ఉండదు. దీంతో భద్రత సరిగా లేదనే విమర్శలున్నాయి. భద్రతా అధికారులు, సిబ్బంది జిల్లా పోలీసు అధికారి ఆధీనంలో ఉంటే ప్రతి రోజు వారిపై నిఘా ఉంటుంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే ఆర్జీయూకేటీని జిల్లా పోలీసు అధికారికి అప్పగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



బాసర ఆర్జీయూకేటీ

సరిపడా సిబ్బంది లేక..

ఆర్జీయూకేటీలో భద్రతాపరంగా డీఎస్పీ, సీఐ, ఎస్సై పోస్టులున్నాయి. కానీ రెండు సంవత్సరాల నుంచి డీఎస్పీ పోస్టుతో పాటు ఎస్సై పోస్టు ఖాళీగా ఉంది. అప్పటి నుంచి సీఐ భద్రతను పర్యవేక్షిస్తున్నారు. ఏదైనా పెద్ద మొత్తంలో సంఘర్షణలు జరిగినప్పుడు స్థానికంగా ఉన్న పోలీసు అధికారులు, పోలీసులు వెళ్లి బందోబస్తు నిర్వహిస్తారు. మిగిలిన సమయంలో కేవలం ఒక సీఐ, ప్రైవేట్ భద్రత సిబ్బంది మాత్రమే ఉంటారు. అక్కడ తాత్కాలికంగా నియమించిన మహిళ ఎస్సై బదిలీ కావడంతో మరింత ఇబ్బందిగా మారింది. సరిపడా సిబ్బంది లేక విద్యార్థుల పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉంటుంది.

ప్రజాప్రతినిధులు దృష్టి సారిస్తే..

ఆర్జీయూకేటీలోని భద్రతపై ప్రజాప్రతినిధులు దృష్టి సారిస్తే మేలు జరుగుతుంది. ప్రస్తుతం డీఎస్పీ, ఎస్సై పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఖాళీగా ఉన్న భద్రతాధికారుల పోస్టులను రాష్ట్ర డీజీపీ దృష్టికి తీసుకెళ్లాలి.

కుటుంబ డిజిటల్ సర్వేను పక్కాగా నిర్వహించాలి

నిర్మల్, న్యూస్‌టుడే : కుటుంబ డిజిటల్ కార్డు జారీ కోసం పైలట్ ప్రాజెక్టు ప్రాంతాల్లో చేపడుతున్న సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి ఇలంబరిది అధికారులను ఆదేశించారు. శనివారం రాత్రి సమీకృత జిల్లా కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా పాలనాధికారి అభిలాష అభినవ్, అదనపు పాలనాధికారి (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్‌లతో కలిసి డిజిటల్ కార్డు సర్వేపై ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోని సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడానికి ప్రభుత్వం జారీ చేయనున్న కుటుంబ డిజిటల్ కార్డుల సర్వేను ఎలాంటి పొరపాట్లు లేకుండా చేయాలని సూచించారు. కుటుంబంలోని వ్యక్తుల పేర్లు, జెండర్, పుట్టినతేది, వయస్సు, కుటుంబంతో ఉన్న సంబంధం, ఫొటో, ఆధార్ నంబరు, చిరునామా, తదితర వివరాలన్నీ పక్కాగా నమోదు చేయాలన్నారు. పట్టణాలు, పంచాయతీల్లో నిర్వహించిన సర్వే తీరు, ఏమైనా సమస్యలున్నాయా.. తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో నిర్వహించిన సర్వే బృందాలతో వివిధ అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు. నిర్మల్, ఆదిలాబాద్, భైంసా ఆర్డీవోలు రత్నకల్యాణి, వినోద్‌కుమార్, కోమల్‌రెడ్డి, జడ్పీ సీఈవోలు గోవింద్, జితేందర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సి.వి.ఎన్.రాజు, తహసీల్దార్లు, ఎంపీవోలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి ఇలంబరిది

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

నిర్మల్ అర్బన్: నిర్మల్ పట్టణం ఫీడర్-2లో మరమ్మతుల దృష్ట్యా ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏడీఈ పి.రవి తెలిపారు. బాగులవాడ, చిక్కడపల్లి, పాత కమల్‌టాకీస్, కస్బా, పాన్‌గల్లి, శిశుమందిర్, జోహ్రానగర్, కళానగర్, నగరేశ్వరవాడ, చింతకుంటవాడ తదితర ప్రాంతాల్లో కరెంటు ఉండదని పేర్కొన్నారు.

నవరాత్రి బందోబస్తుకు 15 మంది హోంగార్డులు

ముథోల్(బాసర), న్యూస్‌టుడే : ఆలయంలో జరుగుతున్న నవరాత్రి ఉత్సవాలకు ఆలయాధికారుల వినతి మేరకు జిల్లా పోలీసు అధికారి జానకి షర్మిల ఆలయ బందోబస్తులో భాగంగా 15 మంది హోంగార్డులను ఆలయానికి నియమించారు. ఉన్న హోంగార్డుల సంఖ్య తక్కువగా ఉండటంతో వచ్చిన వారితో ఇబ్బందులు తొలిగినట్లు ఆలయాధికారులు అంటున్నారు.

అటవీ అభివృద్ధి సంస్థలో సిబ్బంది భర్తీకి చర్యలు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: తెలంగాణలో అటవీ అభివృద్ధి సంస్థ పురోభివృద్ధికి అవసరమైన ప్రణాళికలతో పటిష్ఠ చర్యలు చేపడుతున్నట్లు ఆ సంస్థ ఛైర్మన్ పొదెం వీరయ్య తెలిపారు. పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని ఎఫ్‌డీసీ స్థలంలో రూ.80 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన డివిజన్ కార్యాలయ భవన సముదాయాన్ని శనివారం ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. టీజీఎఫ్‌డీసీ లాభాలబాటలో పయనిస్తోందన్నారు. కాగజ్‌నగర్ డివిజన్ పరిసర అటవీప్రాంతాల్లో ఎకో టూరిజం ద్వారా టీజీఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేయడానికి చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఎఫ్‌డీసీలో సిబ్బంది కొరత ఉందని, భర్తీకి సీఎంతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో మరిన్ని ప్లాంటేషన్లను ఏర్పాటు చేసి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని సూచించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. టీజీఎఫ్‌డీసీ చీఫ్ జనరల్ మేనేజర్ డి.వెంకటేశ్వర్‌రెడ్డి, జనరల్ మేనేజర్ జి.స్కైలాబ్, డివిజన్ మేనేజర్ శ్రావణి, ఎస్పీఎం డీజీఎం నర్కడె, తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఛైర్మన్ పొదెం వీరయ్య తదితరులు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

నిర్మల్, న్యూస్‌టుడే : జిల్లాలో వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు చేయడానికి అవసరమైన కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా అదనపు పాలనాధికారి (రెవెన్యూ) కిషోర్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశం హాలులో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. ఈ సీజన్‌లో పండించిన సన్న రకాల ధాన్యం క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇవ్వాలన్నారు. సన్న, దొడ్డు రకాల సేకరణకు వేర్వేరు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి కేంద్రంలో అవసరమైన సిబ్బందిని నియమించాలని, ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. అందుబాటులో టార్పాలిన్లు, తూకం, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు ఉండేలా చూసుకోవాలన్నారు. మద్దతు ధర, కేంద్రం నిర్వాహకుల వివరాలు, టోల్‌ఫ్రీ నంబరు తెలిపే విధంగా కేంద్రాల్లో బోర్డు ఏర్పాటు చేయాలని, తాగునీరు, టెంటు, విద్యుత్తు వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. డీఆర్డీవో విజయలక్ష్మి, జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారి కిరణ్ కుమార్, జిల్లా మేనేజరు వేణుగోపాల్, మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్, రైస్ మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, లారీ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పాత బస్టాండులో చెత్తతో దర్శనమిస్తున్న రోడ్డు



చెత్తను సంచుల్లో నింపి రోడ్డుపై వేసి

ధర్నాలో కార్మికులు.. పేరుకుపోయిన వ్యర్థాలు

మున్సిపల్ కార్మికులు తమకు వేతనాలు చెల్లించడం లేదంటూ అయిదు రోజులుగా విధులు బహిష్కరించి నిరసన చేపడుతున్నారు. దీంతో నిర్మల్ పట్టణంలో చెత్త నిల్వలు ఎక్కడికక్కడ పేరుకుపోయాయి. దసరా సీజన్ కావడంతో వస్త్ర దుకాణాల ద్వారా ఎక్కువ మొత్తంలో చెత్త బయటకు రావడం, రోడ్లపై ప్లాస్టిక్ వ్యర్థాలు చిందరవందరగా పడి ఉండటంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి కార్మికుల సమస్యను తొందరగా పరిష్కరించి పట్టణంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

- చిత్రం : న్యూస్‌టుడే, నిర్మల్

వట్టి వేరు మొక్కల పెంపకంపై దృష్టి

మామడ, న్యూస్‌టుడే : బహుళ ప్రయోజనాలున్న వట్టి వేరు మొక్కల పెంపకంపై అధికారులు దృష్టి సారించాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని కొత్తసాంగ్వి పరిసరాల్లోని ఖాళీ స్థలంలో వాటి పెంపకం కోసం స్థల పరిశీలన చేశారు. వట్టి వేరు మొక్కలు ఆయుర్వేద మందుల తయారీతో పాటు వాటి ఆకులు పశుగ్రాసంగా ఉపయోగపడతాయన్నారు. గ్రామాల్లో ఆ మొక్కలను నాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. ఎంపీడీవో గంగాసాగర్‌రెడ్డి, ఏపీవో శివాజీ, ఉపాధి హామీ సిబ్బంది సాయిచరణ్, రవి, భారతి, నవీన్ పాల్గొన్నారు.



స్థల పరిశీలన చేస్తున్న డీఆర్డీవో విజయలక్ష్మి, అధికారులు

మేమున్నాం.. మీకు తోడుగా...

నిర్మల్ 97053 46693
భైంసా 63099 94649
ఖానాపూర్ 96401 62091

సమస్య : పట్టణంలోని భగత్‌సింగ్ చౌరస్తా వద్ద గోకుల్ నగర్‌కు వెళ్లే మార్గంలో రహదారి మధ్యన కల్వర్టుపై స్లాబు పగిలి ప్రమాదకర గుంతలు ఏర్పడ్డాయి. **- సంతోష్, ప్రైవేటు ఉద్యోగి**

సమాధానం : వెంటనే ఇంజినీరింగ్ విభాగం అధికారులతో పరిశీలింపజేసి మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరిస్తాం. **- బి.రాజేశ్ కుమార్, పుర కమిషనర్, భైంసా** - న్యూస్‌టుడే, భైంసా

కుంట చెంత స్వచ్ఛత పనులు



ఖానాపూర్, న్యూస్‌టుడే : పట్టణంలోని కప్పల కుంట చెంత చెత్తాచెదారం వేస్తున్నారని 'మేమున్నాం- మీకు తోడుగా' వేదికగా శనివారం సమస్య ప్రచురితమైన కథనంపై మున్సిపల్ శానిటేషన్ ఇన్‌ఛార్జి మానాల శంకర్ స్పందించారు. కుంట చెంత స్వచ్ఛత పనులు చేపట్టారు. పుర సిబ్బంది చెత్తా చెదారాన్ని డంపింగ్ యార్డుకు తరలించారు

రోడ్డు సౌకర్యం లేక.. అవస్థలు తప్పక



మాటేగాం సమీపంలోని గిడ్డంగుల నుంచి పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న క్రమంలో దిగబడిన లారీ

జాతీయ రహదారి 61 నుంచి మండలంలోని మాటేగాం సమీపంలోని గిడ్డంగి (అర కిలోమీటరు) వరకు రోడ్డు సౌకర్యం సరిగా లేక వాహన చోదకులకు అవస్థలు తప్పడం లేదు. సరకులతో భారీ వాహనాలు వెళ్తున్న క్రమంలో చిత్తడిలో కూరుకుపోతున్నాయి. 20-30 టన్నుల వాహనాలు వెళ్లాలంటే సీసీ లేదా తారు రహదారి ఉండాలి. ఇక్కడ మాత్రం మొరం రహదారిపై ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. భైంసా ఎంఎల్ఎస్ పాయింట్‌లో బియ్యం నిల్వకు సరిపడా గిడ్డంగి సామర్థ్యం లేకపోవడంతో ఇక్కడే అద్దెకు తీసుకుని నిల్వ చేస్తున్నారు. ఇటీవల 30 టన్నుల సామర్థ్యంతో ఓ లారీ వెళ్తుండగా చిత్తడి నేలలో దిగబడిపోయింది. ఇదే విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ దృష్టికి తీసుకెళ్లగా తాత్కాలిక మరమ్మతులకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. **- న్యూస్‌టుడే, భైంసా గ్రామీణం**

రహదారి ఇలా.. విద్యాలయానికి వెళ్లేదెలా..?



భారీ గుంతలతో బురదమయంగా రహదారి

సారంగాపూర్ మండలం చించోలి(బి) సమీపంలోని మైనార్టీ గురుకుల విద్యాలయానికి వెళ్లే రహదారి పరిస్థితి ఇది. ఇక్కడ సుమారు 450 మంది విద్యార్థులు ఉంటారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది నిత్యం విద్యాలయానికి వచ్చి పోవాల్సి ఉంటుంది. తమ పిల్లలను విద్యాలయంలో చేర్పడానికి, తీసుకెళ్లడానికి, రెండో శనివారం కలవడానికి వందల మంది పోషకులు వస్తుంటారు. రెండు, అడుగుల లోతైనా గుంతలు, బురదమట్టితో నడవడానికే ఇబ్బందిగా ఉంటుంది. ఇదే మార్గంగుండా తెలంగాణ విత్తన శుద్ధి కేంద్రం, ఎంఎల్ఎస్ పాయింట్, ఇతర గోదాములకు నిత్యం 50 వరకు లారీలు వెళ్లి వస్తుంటాయి. దీంతో రహదారి దెబ్బతింటోంది. ఈ రహదారిపై ఒక కల్వర్టు నిర్మిస్తే సీసీ వేయిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. **-న్యూస్‌టుడే, సారంగాపూర్**

అతిథి అధ్యాపకుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్: జిల్లాలోని కుంటాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అయిదు అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మాధ్యమిక జిల్లా విద్యాధికారి జె.పరశురాం తెలిపారు. ఇంగ్లిష్, తెలుగు, కెమిస్ట్రీ, జువాలజీ, ఎకనామిక్స్ సబ్జెక్టుల్లో బోధించడానికి అర్హులైన అభ్యర్థులు ఈ నెల 6 నుంచి 9 వరకు జిల్లా కేంద్రంలోని ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మతిస్థిమితంలేని యువకుడి ఆత్మహత్య



శంకర్

కడెం, న్యూస్‌టుడే : మండలంలోని కన్నాపూర్ పంచాయతీ వకీల్‌నగర్‌కు చెందిన తొడసం శంకర్ (25) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై కృష్ణసాగర్ కథనం మేరకు.. శంకర్ మతిస్థిమితం సరిగాలేక ఏపనీ చేయకుండా తిరుగుతుండేవాడు. ఈ నెల 4న రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి పడుకున్నాడు. అర్ధరాత్రి దాటాక కుటుంబ సభ్యుల్లో ఒకరు బహిర్భూమికి లేచిన సమయంలో ఇంటి ఎదుట దూలానికి తాడుతో ఉరేసుకుని చనిపోయి కనిపించాడు. ఈ విషయమై మృతుని తండ్రి లస్సు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ముథోల్, న్యూస్‌టుడే : ముథోల్ సమీపంలో ముథోల్, బాసర జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు కథనం ప్రకారం.. ముథోల్ సమీపంలోని బాసర మండలంలోని కిర్గుల్(బి) గ్రామానికి చెందిన దీపక్, యోగేష్ భైంసా మండలంలోని దేగాం గ్రామంలో ఉన్న అన్నయ్య దగ్గరికి వెళ్లి తిరిగి కిర్గుల్‌కు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ముథోల్ సమీపంలో రాగానే ద్విచక్రవాహనంలో గాలి తక్కువగా ఉండని రోడ్డు పక్కన ఉన్న దుకాణంలో గాలి కొట్టించుకొని వస్తున్న ద్విచక్రవాహనం ఢీ కొట్టడంతో దీపక్, యోగేష్ తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం భైంసా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన ద్విచక్రవాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు



మాటేగాం సమీపంలో పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లతో గ్రామీణ సీఐ ఎం.నైలు

భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే : అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని భైంసా గ్రామీణ సీఐ ఎం.నైలు హెచ్చరించారు. జాతీయ రహదారి 61పై మాటేగాం సమీపంలో శనివారం నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. సుద్దవాగు, వాగుల పరీవాహక ప్రాంతాల్లోని గ్రామాల అవసరాలకు మాత్రమే ఇసుక వాడుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రెవెన్యూ, పంచాయతీలకు రాయల్టీ చెల్లించి రసీదులు వెంట ఉంచుకుంటే రవాణాకు వీలుంటుందన్నారు. పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లను తహసీల్దార్ ప్రవీణ్ కుమార్‌కు అప్పగించారు. భైంసా గ్రామీణ ఎస్సై శ్రీనివాస్ యాదవ్, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకునేలా చిన్నారుల చిత్రలేఖనం



తాము వేసిన చిత్రాలతో చిన్నారులు, అభినందిస్తున్న అటవీశాఖ అధికారులు

కడెం, న్యూస్‌టుడే : మండలంలోని కల్లెడ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం ఉడుంపూర్ అటవీ రేంజి అధికారుల ఆధ్వర్యంలో 70వ వన్యప్రాణి వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. విద్యార్థులను అభినందిస్తూ బహుమతులను అందజేశారు. ఎఫ్ఆర్వో అనిత, డీఆర్వో ప్రకాష్, ఎఫ్ఎస్ఓలు సరిత, పాండురంగ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరూ వివరాలు అందజేయాలి

ఖానాపూర్, న్యూస్‌టుడే : డిజిటల్ ఫ్యామిలీ కార్డుల కోసం వచ్చే మున్సిపల్ సిబ్బందికి వివరాలు అందజేసి సహకరించాలని పుర ఛైర్మన్ చిన్నం సత్యం, జడ్పీ సీఈవో గోవింద్‌నాయక్ అన్నారు. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన పట్టణంలోని శ్రీరాంనగర్‌లో నమోదు ప్రక్రియను శనివారం పరిశీలించారు. భవిష్యత్తులో ప్రభుత్వ పథకాల అమలులో ఈ కార్డులే కీలకం కానున్న నేపథ్యంలో ప్రతీ ఒక్కరూ వివరాలు నమోదు చేయాలన్నారు.

ఘనంగా చండీహోమం



వానల్‌పాడ్‌లో చండీహోమంలో పాల్గొన్న భక్తులు

భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని వానల్‌పాడ్‌లో చింతచెట్టులో స్వయంభుగా వెలసిన శ్రీ సింహసహిత విజయ దుర్గామాత వద్ద భక్తులు శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితుడు గురుమంచి చంద్రశేఖర్ శర్మ, అర్చకులు మంత్రోచ్ఛరణలు, భాజాభజంత్రీలతో గ్రామంలో ఉత్సవమూర్తుల శోభాయాత్ర నిర్వహించారు. మహాగణపతి, పుణ్యవచనం, యాగశాల ప్రవేశం, దేవతామూర్తులకు పవిత్ర జలాలతో అభిషేకం చేశారు. పలువురు భక్తులు సతీసమేతంగా హోమంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

కుభీరు, భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే : రైతులు సోయా కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. శనివారం కుభీరులో సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. క్వింటా సోయాలకు రూ.4892 చెల్లించారు. కొనుగోలు కేంద్రంలో సోయాలు విక్రయించే రైతుల దగ్గర నుంచి ఎకరాకు ఆరు క్వింటాలు తీసుకుంటామని మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి రైతులకు సూచించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ సమన్వయకర్త రేకుల గంగాచరణ్, ఏఎంసీ కార్యదర్శి గంగన్న, పీఏసీఎస్ సీఈఓ ఎగ్గాం క్రాంతికుమార్, నాయకులు పాల్గొన్నారు. భైంసా మండలంలోని మాటేగాంలోనూ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు లస్మన్న, ఏడీఏ వీణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే సహించం

ముథోల్(బాసర): పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. నవరాత్రుల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం బాసర ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని సూచించారు. ప్రధాన రహదారులను శుభ్రం చేయించాలని చెత్తను ఎప్పటికప్పుడు డంపింగ్‌యార్డుకు తరలించాలన్నారు. డీఎల్‌పీవో సుదర్శన్‌పటేల్, ఈఓ గోవింద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

న్యాయశాస్త్రంలో డాక్టరేట్ ప్రదానం



ఉపాధ్యాయుడు సాజిద్‌ను సన్మానిస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : నిర్మల్ పట్టణం గాజులపేట్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉర్దూ మాధ్యమంలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ సాజిద్ మేరాజ్ న్యాయశాస్త్రంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. శనివారం నిర్మల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డీఈవో ఎ.రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ఉపాధ్యాయులు సన్మానించారు. 'ఇండియన్ కాన్‌స్టిట్యూషనల్ డెవలప్‌మెంట్ త్రూ జ్యుడీషియల్ ఇంటర్‌ప్రిటేషన్ ఎ క్రిటికల్ స్టడీ' అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లా విశ్రాంత ప్రొఫెసర్ డా.జి.వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో పూర్తి చేసి డాక్టరేట్ పట్టా పొందారు. జిల్లా విద్యాశాఖ సూపరింటెండెంట్ సురేందర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు షక్కీరళీ, గఫార్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

రాజశ్యామల పీఠంలో ఎమ్మెల్యే పూజలు



అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణ

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే : స్థానిక బంగల్‌పేట్ శివారులోని శ్రీరాజశ్యామల పీఠంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలిసారిగా ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలోని స్వయంభు నాడీగణపతిని దర్శించుకున్నారు. అనంతరం రాజశ్యామల అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు జరిపారు.

బతుకమ్మ పేర్చి.. ఆడిపాడి



కుభీరులో బతుకమ్మ నిమజ్జనానికి తరలుతున్న విద్యార్థినులు, అధ్యాపకులు



కల్లూరులో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



నిర్మల్‌లో..



దిలావర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు



కడెం: కన్నాపూర్ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకల్లో విద్యార్థినులు

జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ ఉత్సవాలను శనివారం బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థినులు తీరొక్కపూలతో బతుకమ్మను పూర్చి అందులో గౌరమ్మను ఉంచి పూజలు చేశారు. బతుకమ్మ పాటలపై నృత్యాలు చేస్తూ ఆడిపాడారు. అనంతరం చెరువులో బతుకమ్మను నిమజ్జనం చేశారు.
- న్యూస్‌టుడే, కుభీరు, కుంటాల, దిలావర్‌పూర్, నిర్మల్ పట్టణం, భైంసా, ఖానాపూర్, కడెం

కేసులను సత్వరం పరిష్కరించాలి



భైంసా కోర్టు కార్యాలయంలో పోలీసులతో కేసులపై సమీక్షిస్తున్న ఏపీపీ బి.అరుణ

భైంసా, న్యూస్‌టుడే : కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని భైంసా ప్రథమ శ్రేణి న్యాయస్థానం అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.అరుణ అన్నారు. శనివారం తన కార్యాలయంలో డివిజన్ పోలీసు, అబ్కారీ అధికారులతో అపరిష్కృత కేసులపై నిర్వహించిన నెలవారి సమావేశంలో సమీక్షించారు. కేసులకు సంబంధించిన ఆధారాలు, సాక్ష్యాలను కొత్త చట్టాలకు అనుగుణంగా త్వరితగతిన సేకరించి, సత్వర పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. భైంసా డివిజన్‌లోని సీఐలు, ఎస్సైలు, ఆబ్కారీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న జిల్లా నాయకులు

ఖానాపూర్, న్యూస్‌టుడే : హైదరాబాద్ గాంధీభవన్‌లో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దుర్గాభవాని పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని మున్సిపల్ ఒప్పంద కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి జగన్మోహన్ కోరారు. వారు చేపట్టిన సమ్మెకు పార్టీ ఆధ్వర్యంలో శనివారం మద్దతు పలికారు. లక్ష్మీ, శ్రీనివాస్, ఈశ్వర్, జయశ్రీ, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణకు ప్రత్యేక పూజలు



కదిలి అన్నపూర్ణ మాతా ఆలయంలో కొలువైన అమ్మవారు



అక్కాపూర్‌లో కుంకుమార్చనలో మహిళలు



బాసరలో చంద్రఘంట దేవిగా అమ్మవారు



గోడలపంపు గ్రామంలో..



కడెం : లింగాపూర్‌లో శాకాంబరిగా దర్శనమిస్తున్న దుర్గాదేవి

దిలావర్‌పూర్, నిర్మల్ గ్రామీణం, ముథోల్(బాసర), సోన్, ఖానాపూర్ గ్రామీణం, ఖానాపూర్, న్యూస్‌టుడే : దేశంలోనే రెండవ దక్షిణాభిముఖ ఆలయంగా ప్రసిద్ధిగాంచిన పురాతన ప్రాశస్త్యం కలిగిన కదిలి అన్నపూర్ణ మాతా ఆలయంలో శరన్నవరాత్రుల సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రుల్లో మూడో రోజు అన్నపూర్ణదేవిగా దర్శనం ఇవ్వడంతో అనేక మంది భక్తులు దేవి దర్శనానికి బారులు తీరారు. నిర్మల్ గ్రామీణ మండలం అక్కాపూర్ గ్రామంలో దుర్గామాత మండపం వద్ద మహిళలు కుంకుమార్చన నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు బాసర సరస్వతీ అమ్మవారు చంద్రఘంటదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కోటి గాజుల మండపంలో హైదరాబాద్, భైంసాకు చెందిన విద్యార్థులు కూచిపూడి, భరతనాట్యం నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

మొరం దళారులపై చర్యలు తప్పవు



తవ్వకాలు చేపట్టిన ప్రాంతంలో జేసీబీ వద్ద కాంగ్రెస్ నాయకులు

ఖానాపూర్, న్యూస్‌టుడే : ప్రభుత్వ భూమి 110 ఎకరాల్లోని రెండు పడక గదుల ఇళ్ల కాలనీ వెనుక ప్రాంతంలో అక్రమంగా మొరం తవ్వకాలు చేపట్టిన దళారులను వదిలే ప్రసక్తే లేదని మున్సిపల్ ఛైర్మన్ చిన్నం సత్యం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దయానంద్ అన్నారు. పట్టణంలోని కుమురం భీం చౌరస్తా శివారులో మొరం తవ్వకాలు చేపట్టిన ప్రాంతాన్ని శనివారం పరిశీలించారు. వైఎస్ఆర్ హయాంలోనే పేదల కోసం ప్రభుత్వం 110 ఎకరాల స్థలాన్ని కేటాయించిందన్నారు. సామాన్యుల ఇంటి నిర్మాణానికి కూడా మొరం దొరకకుండా వ్యాపారులు ప్రభుత్వ స్థలంలో మొరం తవ్వకాలు చేపట్టడం పట్ల ఎమ్మెల్యే బొజ్జుపటేల్ ఆగ్రహం వ్యక్తం చేశారని అన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి మొరం తవ్వకాలపై ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నించారు. మైనింగ్ అధికారులకు రాశామని తహసీల్దార్ చెప్పిన సమాధానంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలో స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది.

గడ్డం వెంకటస్వామికి ఘన నివాళి



మామడ మండల పరిషత్ కార్యాలయంలో..



నిర్మల్: నివాళులర్పిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ ఈశ్వర్



లక్ష్మణచాంద తహసీల్దార్ కార్యాలయంలో..



కుంటాలలో..

నిర్మల్, మామడ, లక్ష్మణచాంద, కుంటాల, న్యూస్‌టుడే: కేంద్ర మాజీ మంత్రి దివంగత గడ్డం వెంకటస్వామి జయంతిని శనివారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో జరిపారు. ఈ మున్సిపల్ ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మున్సిపల్ కమిషనర్ సి.వి.ఎన్.రాజు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మామడ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో గంగాసాగర్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. లక్ష్మణచాంద తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జానకీ ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. కుంటాల తహసీల్, ఎంపీపీ కార్యాలయాల్లో జి.వెంకటస్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

గంగనీళ్లకు భక్తుల పయనం



కుంటాల: విఠాపూర్ నుంచి గంగనీళ్లకు వెళ్తున్న భక్తులు

కుంటాల, న్యూస్‌టుడే : అడెల్లి పోచమ్మ గంగ నీళ్ల జాతరను పురస్కరించుకొని శనివారం మండలంలోని ఆయా గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. జాతర ముగించుకుని వచ్చాక సొంత ఊళ్లలో గ్రామ దేవతలకు జలాభిషేకం చేసి పూజలు నిర్వహిస్తారు.



కుభీరులో..

కుభీరు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని పల్సి గ్రామంలోని గ్రామదేవతలను వీడీసీ ఆధ్వర్యంలో గంగాస్నానానికి ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లారు. సాంగ్వీ వాగులో దేవతామూర్తులకు గంగాస్నానాలు చేయించి తిరుగు ప్రయాణంలో అడెల్లి పోచమ్మ, దిలావర్‌పూర్ పోచమ్మ ఆలయాల్లో దేవతామూర్తుల దర్శనం తీసుకొని ఆదివారం పల్సికి చేరుకుంటారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చాటాలి

భైంసా: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చాటాలని భాజపా జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎస్ఎస్ కాటన్ మిల్లులో శనివారం ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్సీ నియోజకవర్గ బాధ్యులు గంగాధర్, సుమన్, గంగాధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపాల్ సార్డా, నారాయణరెడ్డి, పార్లమెంటు ప్రభారీ భూమయ్య, పట్టణాధ్యక్షుడు మల్లేశ్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

లక్ష్మణచాంద: తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ ఎస్ఎంబీ విలాస్ అన్నారు. మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ)లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆర్థిక అక్షరాస్యతపై గ్రామస్తులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంకు క్షేత్ర సహాయకుడు అరవింద్, అకౌంటెంట్ శశికుమార్, ఐకేపీ మహిళలు పాల్గొన్నారు.

బాల్య మిత్రుల ఆర్థిక సాయం



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న మిత్రులు

కుంటాల, న్యూస్‌టుడే: మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన ఈజీఎస్ క్షేత్ర సహాయకుడు గైని రాందాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. బెల్లంపల్లి గురుకుల పాఠశాలకు చెందిన బాల్య మిత్రులు ఆ బాధిత కుటుంబ సభ్యులకు శనివారం రూ.43,500 ఆర్థిక సాయం అందజేశారు. అధైర్య పడొద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఖానాపూర్ గ్రామీణ : మండలంలోని గోసంపల్లె గ్రామానికి చెందిన కడమంచి రాజవ్వ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఓకేఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు కృష్ణంరాజు శనివారం తనవంతు సహాయంగా మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు తన మిత్ర బృందం సహాయంతో అందజేశారు. అదే గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచి నామెడ ధర్మరాజు కూడా రూ.2 వేలు అందజేశారు.

సంక్షిప్త సమాచారం

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

లోకేశ్వరం : మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన పలువురికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను శనివారం ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అందజేశారు. భాజపా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు భోజన్న, మాజీ సర్పంచి సత్యం, నాయకులు గంగాధర్‌లు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోండి

కుంటాల : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ తెలిపారు. 2021కి ముందు డిగ్రీ పూర్తి చేసుకున్న అభ్యర్థులు నవంబరు 6లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఏఓకు వినతి

ముథోల్(బాసర) : బాసర ఆర్జీయూకేటీలో చీఫ్ వార్డెన్ శ్రీధర్‌పై వచ్చిన ఆరోపణలలో వాస్తవం లేదని శనివారం ఆర్జీయూకేటీ అధ్యాపకుల సంఘం నాయకులు ఏఓ రణదీర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. సంఘం సభ్యులు కృష్ణప్రసాద్, సతీష్‌కుమార్, ఉపేందర్, సనాకుమార్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ విచారణ చేపట్టాలని వినతి

ముథోల్(బాసర) : బాసర ఆర్జీయూకేటీ ఇన్‌ఛార్జి ఉపకులపతిపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని శనివారం హైదరాబాద్‌లో ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కను ఓయూ ఐకాస నేతలు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.

కొనసాగుతున్న విధుల బహిష్కరణ

నిర్మల్ అర్బన్ : నిర్మల్ పురపాలికలో ఒప్పంద పద్ధతిలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 338 మంది వేతన బకాయిల మంజూరు కోసం విధులు బహిష్కరించారు. శనివారం నాటికి నిరసన అయిదో రోజుకు చేరుకుంది. తమకు రావాల్సిన మూడు నెలల జీతాలు వెంటనే అందజేయాలని చెప్పారు.

నాణ్యమైన ధాన్యానికే మద్దతు ధర


దిలావర్‌పూర్: రైతులు ధాన్యంలో తాలూ తప్పా లేకుండా నూర్పిడి చేసిన పంటకే మద్దతు ధర లభిస్తుందని ఏవో రాజశేఖర్ అన్నారు. శనివారం దిలావర్‌పూర్ రైతు వేదికలో అన్నదాతలకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు



అంబకంటి తండాలో తీజ్ ఉత్సవాల్లో చిన్నారులు

కుంటాల: మండలంలోని అంబకంటి తండాలో శనివారం గిరిజన మహిళలు, యువతులు, చిన్నారులు తీజ్ పండగను ఘనంగా నిర్వహించారు. చిన్నాపెద్దా తేడా లేకుండా సంప్రదాయ నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు. గోధుమ బుట్టలను నెత్తిన పెట్టుకుని ప్రధాన వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు.



కష్టాలను ఎదిరిద్దాం.. కన్నీళ్లను తుడిచేద్దాం



● నవరాత్రుల ప్రబోధమిదే

● బతుకులోని మాధుర్యాన్ని గుర్తిద్దాం



ఈటీవీ - ఆదిలాబాద్ :

కలకానిది విలువైనది బతుకు. కన్నీటిధారలలోనే బలిచేయకు. అగాధమౌజలనిధి లోన ఆణిముత్యమున్నటులే. శోకాలమరుగునదాగి సుఖమున్నదులే. ఏదీ తనంత తానై నీదరికిరాదు. శోధించి సాధించాలి.. అంటాడు మహాకవి శ్రీశ్రీ. ఆకాశంలో మెరుపు క్షణకాలమే కావచ్చు. ప్రపంచానికి వెలుగునిస్తుంది. విరగ కాసిన వృక్షం దెబ్బతగిలినంత మాత్రాన ఫలాలు ఇవ్వటం మరిచిపోదు. జీవితమూ అంతే. చిన్న సమస్యలకే కుంగిపోయి బలవన్మరణాలకు పాల్పడితే ఫలితమేముంటుంది? కష్టాలను ఎదుర్కొంటూ.. కన్నీళ్లను తుడిచేస్తూ ముందుకు సాగితేనే బతుకు సార్థకమవుతుంది. శరన్నవరాత్రులతో పాటు తొమ్మిది రోజుల బతుకమ్మ సంబరంలోనూ అదే పరమార్థం ఉంది. ఎదిరించి పోరాడాలనే ధీరత్వం ఇమిడి ఉంది. సహజసిద్ధమైన వనరులతో మమేకమై ఉన్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆత్మహత్యలు పెరగటం ఆందోళన కలిగిస్తోంది.

శరన్నవరాత్రులు - బతుకమ్మ సంబరాలు ధీరత్వానికి ప్రతీకలు. తొమ్మిది అవతారాలను పరిశీలిస్తే చెడుపై విజయం సాధించిన హితం వెల్లడవుతుంది. పరిస్థితుల రీత్యా బాలత్రిపుర సుందరి, గాయత్రి, అన్నపూర్ణ, లలితా త్రిపుర సుందరి, మహాచండీ, మహాలక్ష్మీ, సరస్వతీ, దుర్గా, మహిషాసుర మర్దని, రాజరాజేశ్వరి దేవి అవతారాలతో బతుకులోని గొప్పదనాన్ని వెల్లడిస్తోంది. తొమ్మిది రోజుల బతుకమ్మ వేడుకల సారాంశం కష్టాలను దిగమింగి జీవితాన్ని ఆస్వాదించాలని చాటిచెబుతోంది. ఆలోచిస్తే అంతర్లీనంగా కుటుంబ మాధుర్యమేంటో గుర్తుకొస్తుంది. బతుకులోని తీయదనం వెల్లడవుతుంది.

వీరత్వానికి ప్రతీక

జోడేఘాట్ కేంద్రంగా సాగిన కుమురం భీం పోరాటం ధీరత్వానికి ప్రతీక. ఇంద్రవెల్లి వేదికగా సాగిన ఆదివాసీల విముక్తి పోరు మరో జలియన్ వాలాబాగ్‌గా ప్రసిద్ధి పొందింది. ఈ రెండు ఘటనలను పరికించి చూస్తే తమ భావాలను పరస్పరం చర్చలు - పరిష్కార మార్గాలేంటి? అని సమాలోచనలు చేయటమే కాకుండా దండుగా ముందుకు సాగినట్లు చరిత్ర వెల్లడిస్తోంది. ఇప్పుడు దండుగా సాగాల్సిన అవసరం లేదు. సమాజం కోసం కదం తొక్కాల్సిన పని లేదనుకున్నా కనీసం ఎవరి కుటుంబాల గురించి వారు ఆలోచిస్తే ఆత్మహత్య అనే ఆలోచననే రాదు. రైతుల కష్టాలను నెమరేసుకుంటే మనకున్నవి ఇబ్బందులే అని అనిపించవు.




ఏం చేయాలంటే..

ఉమ్మడి జిల్లాలో నిర్మల్, మంచిర్యాల ప్రాంతాల్లో ఆత్మహత్యల ఘటనలు ఎక్కువగా నమోదవుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు, పౌర సమాజం మేల్కోవాలి. జరగకుండా కార్యాచరణను ప్రకటించాలి. గోదావరి, పెన్‌గంగ, ప్రాణహిత జీవనదులే కాదు. సింగరేణి బొగ్గు, తెల్లబంగారమైన పత్తి సహా సహజసిద్ధమైన ప్రకృతి వనరులున్న ఉమ్మడి జిల్లాలో బతుకుదెరువుకు ఉపయుక్తంగా ఉంటుందని వివరిస్తే బలవన్మరణాలు జరగకుండా చూడొచ్చు.



ఆత్మహత్యతో వచ్చేదేమిటి?



అదో ఆనందమైన కుటుంబం. భార్యాపిల్లలతో జీవితం సాఫీగా సాగుతోంది. కొన్ని నిర్ణయాలతో కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంది. స్నేహితులతో చర్చించలేదు. బంధువులను సంప్రదించలేదు. భార్యాపిల్లలు సహా తాను ఆత్మహత్య చేసుకోవటంతో ఆ కుటుంబ ప్రస్థానమే ముగిసిపోయింది. భావిజీవితం కలిగిన పిల్లల బతుకు బలైంది. బతికున్న కుటుంబ సభ్యుల్లో తీరని దుఃఖాన్ని మిగిల్చింది. అపవాదును తెచ్చిపెట్టింది. కారణాలు వేరైనా ఉమ్మడి జిల్లాలో ఇలాంటివి ఎన్నో చోటుచేసుకోవటం మనసును కలిచివేస్తోంది.

జిల్లాల వారీగా ఆత్మహత్యల వివరాలు..

జిల్లా	ఆదిలాబాద్	ఆసిఫాబాద్	నిర్మల్	మంచిర్యాల
2023	260	156	437	377
2024	193	121	296	350



రాగిజావా.. ఆరోగ్యానికి రక్ష!

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే:

పూర్వ ప్రాథమిక విద్యను అందించడమే కాకుండా ఆరోగ్య రక్షణకు తోడ్పాటు అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారులకు మరింత ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. త్వరలో కేంద్రాల్లో రాగి జావా అందిస్తామని మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రకటించడం వారి ఆరోగ్యం మరింత మెరుగుపడే అవకాశం కలగనుంది.

● అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీకి సన్నాహాలు

ఇప్పటికే లబ్ధిదారులకు పౌష్టికాహారం అందిస్తున్నా.. చాలా మంది చిన్నపిల్లలు పోషకాహార లోపం నుంచి బయటపడలేకపోతున్నారు. ఎత్తుకు తగ్గ బరువు లేక అనారోగ్యాలు చుట్టుముడుతున్నాయి. ఈ క్రమంలో రాగిజావా రక్త హీనతను తగ్గించి ఎముకలు బలంగా మారడానికి ఎంతో మేలు చేస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు 2.50 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. ఘన రూపం కంటే ద్రవరూప ఆహారంతో త్వరగా జీర్ణం అయి మంచి ఆరోగ్యానికి అవకాశం ఏర్పడుతోందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

వెంటాడుతున్న పోషకాహార లోపం..

చాలా మంది చిన్నారులు పౌష్టికాహారం సరిగా లేక పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఎత్తుకు తగ్గ బరువు లేక బక్క పలచగా ఉంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని 4,124 అంగన్‌వాడీ కేంద్రాల్లో లోప పోషణ ఉన్న పిల్లలు 5,036 కాగా.. తక్కువ బరువు ఉన్న వారు 16,452 మంది వరకు ఉన్నారు.

పీవీటీజీల కోసం ప్రత్యేక పోషకాహారం..

అంగన్‌వాడీ కేంద్రాల్లోని లబ్ధిదారులకు నిర్వాహకులు నిత్యం గుడ్డుతో భోజనం పెడతారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని పీవీటీజీ (పర్టిక్యులర్లీ వల్నరబుల్ ట్రైబల్ (గ్రూప్స్)ల్లో చాలా మంది రక్తహీనత, ఎదుగుదల లోపం తదితర అనేక రుగ్మతలతో బాధపడుతున్నారు. వీరికి మరింత బలవర్ధకమైన ఆహారం అందించాలన్న ఉద్దేశంతో ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరి పోషణ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 291 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ అనుబంధ ఆహారాన్ని అందిస్తున్నారు. దీనిలో జొన్న గట్క, చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలు, హల్వా, పల్లిపట్టీ, నువ్వుల పట్టీలను పంపిణీ చేస్తున్నారు.

జిల్లాల వారీగా అంగన్‌వాడీ కేంద్రాలు, నమోదైన లబ్ధిదారులు, పిల్లల ఆరోగ్య పరిస్థితి..

జిల్లా	కేంద్రాల సంఖ్య	0-6 ఏళ్ల పిల్లలు	గర్భిణులు	బాలింతలు	అతి తీవ్ర పోషకాహార లోపం	తీవ్ర పోషకాహార లోపం	అతి తక్కువ బరువు	తక్కువ బరువు
కుమురంభీం	973	46414	4981	3223	210	737	535	3692
ఆదిలాబాద్	1256	58,082	6832	3756	316	1612	903	5105
మంచిర్యాల	969	48,557	4681	3269	200	785	314	2418
నిర్మల్	926	1,257	6070	4329	254	922	430	3055

గోదారమ్మకు పోచమ్మ నగలు

● ప్రారంభమైన గంగనీళ్ల జాతర



ఆభరణాలను ఎత్తుకొని ఆలయం నుంచి పాదయాత్రను ప్రారంభిస్తున్న ఈవో రమేష్

సారంగాపూర్, న్యూస్‌టుడే : ఏడాదికోసారి జరిగే 'గంగనీళ్ల' జాతర ఉత్సవాలు శనివారం అడెల్లి మహా పోచమ్మ ఆలయం వద్ద అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 10 గంటలకు అడెల్లి గ్రామంలోని సేవాదారుల ఇంటి నుంచి ఆభరణాలను ఆలయానికి తీసుకెళ్లారు. ఆలయ ఈవో రమేష్ ఆధ్వర్యంలో బాలాలయంలోని పోచమ్మ తల్లి ఎదుట ఆభరణాలను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వెండి కడవ, ఆభరణాలతో ఆలయ సిబ్బంది, భక్తులు గోదావరికి పాదయాత్రగా పయనమయ్యారు. పోచమ్మ ఆలయం నుంచి మొదలైన పాదయాత్ర దేవరకోట, రాయినగర్, అడెల్లి, సారంగాపూర్, యాకర్‌పెల్లి, వంజర్, ప్యారమూర్ మీదుగా దిలావర్‌పూర్ మండలంలోని మాడెగాం, దిలావర్‌పూర్, బన్సపల్లి, కంజర్ గ్రామాల మీదుగా సాయంత్రానికి సాంగ్వి సమీపంలోని గోదావరి తీరంలోని అక్కడి పోచమ్మ ఆలయానికి చేరుకుంది. రాత్రికి అక్కడే బస చేయనున్నారు. ఆదివారం వేకువజామున అమ్మవారి ఆభరణాలను పవిత్ర గోదావరి నీటితో శుద్ధి చేసి వెండి కడవలో నీటిని తీసుకొని తిరిగి అవే గ్రామాల మీదుగా పాదయాత్రగా సాయంత్రానికి అడెల్లికి రానున్నారు. అడెల్లి నుంచి ప్రారంభమైన పాదయాత్రలో వేలాది మంది కదం తొక్కుతూ గోదావరికి తరలి వెళ్లా. గంగకుకు శరణు.. మనమైన పూజలే.. అంటూ భక్తి గీతాలు పాడుతూ గంగమ్మ చెంతకు పయనమయ్యారు. జిల్లా పోలీసు అధికారి జానకి షర్మిల ఆదేశాలతో డీఎస్పీ ఎ.గంగారెడ్డి పర్యవేక్షణలో నిర్మల్ గ్రామీణ సీఐ రామకృష్ణ, సారంగాపూర్ ఎస్సై ఎస్. శ్రీకాంత్ ఇతర పోలీసు అధికారులతో కలిసి భారీ బందోబస్తు చేపట్టారు. తహసీల్దార్ శ్రీదేవి, ఎస్సై శ్రీకాంత్, ఎంపీడీవో లక్ష్మికాంత రావు, మాజీ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మాజీ ఆలయ ఛైర్మన్ చందు, కాంగ్రెస్, భాజపా నాయకులు బాలాలయంలోని పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు.



అమ్మవారి ఆభరణాల వెంట పాదయాత్రగా గోదావరికి తరలిన భక్తజనం



ప్రధాన మూర్తిగా నెలకొల్పిన ప్రచండ చండిక విగ్రహం



మాధవేశ్వరి అమ్మవారి నమూనా



మాహోర్‌లోని ఏకవీరా దేవికి ప్రతిరూపంగా..



కశ్మీర్‌లోని సరస్వతి మాతను గుర్తుచేసేలా..

అమ్మవారి శక్తిపీఠాల ప్రదర్శన

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే : అమ్మవారి వివిధ రూపాలకు ప్రతిబింబంగా దేశంలో పలు చోట్ల శక్తిపీఠాలున్నాయి. ఇవి అష్టాదశ శక్తిపీఠాలుగా ప్రసిద్ధి పొందాయి. భక్తులు వీటన్నింటినీ ఒకేసారి దర్శించుకోవటం వీలుపడదు. అయితే.. శక్తిపీఠాలు కాకపోయినా, అక్కడ కొలువైన అమ్మవారి ప్రతిరూపాలను అన్నింటినీ ఒకేచోట దర్శించుకోవచ్చు. దేవీ శరన్నవరాత్రుల నేపథ్యంలో ఈ అవకాశం దక్కిన అనుభూతినిస్తోంది. జిల్లాకేంద్రంలోని శ్రీరాజ్యాంబా పీఠం అచ్చంగా ఈ తన్మయత్వాన్ని భక్తులకు అందిస్తోంది. స్థానిక బంగల్‌పేట్ శివారులోని రాజశ్యామలాదేవి ఆలయ ప్రాంగణంలో దశసింహ ఉద్భవమైన ప్రచండ చండిక ప్రతిమను నెలకొల్పారు. అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి నిత్యం పూజలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో సుప్రసిద్ధమైన శక్తిపీఠాల్లోని అమ్మవారి ప్రతిరూపాలను ఇక్కడ నెలకొల్పారు. నవరాత్రి అమ్మవారి చెంత కార్తిక పూజించొచ్చు. నవరాత్రులు పూర్తయ్యేవరకు నిత్యం అన్నదానం, కుంకుమార్చన, నవమదార్చన చండీహోమం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

స్పందించిన మానవతావాదులు

● పసిపాప ఆకలి తీర్చేందుకు విరాళాలు

బేల, న్యూస్‌టుడే : పసిపాప ఆకలి తీర్చేందుకు మానవతావాదులు తమ వంతు సాయం చేసేందుకు ముందుకొచ్చారు. ఒక్క రోజులోనే 62 మంది స్పందించి రూ. 24,600 ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. రూ.100 మొదలుకొని రూ.2 వేల వరకు అందజేశారు. బేల మండలం టెంబ్రిగూడకు చెందిన దేశ్‌ముఖ్ మారుబాయి ప్రసవమై ఆడపిల్లకు జన్మనిచ్చింది. పుట్టిన 23 రోజులకే తల్లి కోల్పోయిన పసిపాప బతికించేందుకు అమ్మమ్మ, తాతమ్మలు పడరాని పాట్లు పడుతున్నారు. మూడు రోజులకోసారి పాల డబ్బా కొనుగోలు కోసం 6 కి.మీ. దూరం కాలినడకన వాగు దాటి వెళ్లా కష్టాలు పడుతున్నారు. వారి కష్టాలపై ఈనాడులో 'పసిపాప ఆకలి తీర్చేందుకు 6 కిలోమీటర్ల కాలినడక' శీర్షిక కథనం ప్రచురితమైంది. ఎంతో మంది సాయం చేసేందుకు ముందుకు రావడంతో పాటు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. 'ఈనాడు'కు, దాతలకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వందనం

20 పనులు.. ఉపాధి నిధులు

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా పేదలకు ఉపాధి కల్పించేందుకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో చేసే పనుల గుర్తింపు, కార్మిక బడ్జెట్ తయారు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులు క్షేత్ర స్థాయిలో చేపట్టే పనులపై ముమ్మర కసరత్తు చేపట్టారు. -న్యూస్‌టుడే, మంచిర్యాల గ్రామీణం

ఒక్కో పంచాయతీకి 20కి మించకుండా పనులు గుర్తించి వెంటనే పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నారు. పల్లెల్లో ప్రాధాన్యం కలిగిన పనులను గుర్తించి గ్రామసభల ద్వారా ప్రజల ఆమోదం పొందనున్నారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో గుర్తించిన పనులకు బడ్జెట్‌ను రూపొందించి కేంద్రానికి పంపిస్తారు. అనంతరం కేంద్రం నుంచి ఆదేశాలు రాగానే వచ్చే ఏప్రిల్ నుంచి వార్షిక ప్రణాళిక కార్మిక బడ్జెట్ ఆధారంగానే ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేపట్టనున్నారు.



పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

2025-26 ఉపాధి వార్షిక ప్రణాళిక తయారీ ఇలా

వార్షిక ప్రణాళికపై గ్రామసభల నిర్వహణ : 2 అక్టోబర్ నుంచి 30 నవంబర్ 2024 వరకు

జిల్లా స్థాయి వార్షిక ప్రణాళిక ఆమోదం : 21 జనవరి 2025

రాష్ట్ర స్థాయిలో ఆమోదం : 31 జనవరి 2025

లేబర్ బడ్జెట్ విడుదల : 31 మార్చి 2025

జిల్లాల వారీగా జాబ్‌కార్డులు, కూలీల వివరాలు..

జిల్లా	మండలాలు	పంచాయతీలు	జాబ్ కార్డులు	కూలీలు
ఆదిలాబాద్	17	468	1,75,747	3,70,082
కుమురంభీం	15	335	1,29,885	2,77,287
నిర్మల్	18	396	1,80,572	3,70,550
మంచిర్యాల	16	311	1,21,067	2,55,151

వార్షిక బడ్జెట్‌లో చర్చించే అంశాలివే..

పల్లెల్లో పేదలకు కనీసం వంద రోజుల పాటు ఉపాధిని కల్పించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఉపాధిహామీ పథకం ద్వారా 2025-26 సం.లో 17 కేటగిరీల్లో 266 రకాల పనులు చేయనున్నారు.

- ప్రధానంగా అసంపూర్తి పనులపై చర్చించాలి.
- జాబ్ కార్డుల అప్‌డేషన్, పౌర సమాచార బోర్డుల తయారీ, సామాజిక తనిఖీలపై చర్చలు
- సామాజిక తనిఖీల కోసం స్వయం సహాయక సంఘాల నుంచి ముగ్గురు చురుకైన మహిళలను గ్రామ రిసోర్సు పర్సన్లుగా నియమించాలి.
- వ్యవసాయ, సహజ వనరులు, జీవనోపాధుల పెంపు పనులపై చర్చించాలి.
- ఇంకుడు గుంతలు, కంపోస్టు షెడ్, ఉద్యాన శాఖ, ప్లాంటేషన్ పనులను పర్యవేక్షణ
- భూగర్భజలాల పెంపుదలను జల దూత్ యాప్‌లో పొందుపర్చాలి.
- బయోగ్యాస్ ప్లాంట్‌పై, అమృత్ సరోవర్ పథకంపై ప్రత్యేకంగా చర్చించి నిర్ణయం తీసుకుంటారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు

2025-26 ఆర్థిక ఏడాదిలో గ్రామాల్లో పేదలకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. నిబంధనల ప్రకారమే కార్మిక బడ్జెట్ రూపకల్పన చేసేలా చర్యలు తీసుకుంటాం. నిర్దేశిత లక్ష్యం మేరకు కూలీలకు పనిదినాలు కల్పించి చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేసేలా కృషి చేస్తాం. - కిషన్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి, మంచిర్యాల



మొదటిస్థానం కైవసం చేసుకున్న ఉమ్మడిజిల్లా హ్యాండ్‌బాల్‌జట్టు

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో మొదటిస్థానం

మంచిర్యాల క్రీడావిభాగం, ఆసిఫాబాద్, న్యూస్‌టుడే: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్రీడాకారిణులు సత్తాచాటారు. హ్యాండ్‌బాల్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో మెరిశారు. మొదటిస్థానాన్ని కైవసం చేసుకున్నారు. పాఠశాల క్రీడా సమాఖ్య నారాయణపేట జిల్లాలో గత మూడురోజులుగా నిర్వహిస్తున్న 68వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో అండర్-17 బాలికల విభాగంలో ప్రతిభ చాటి పసిడి పతకాన్ని సాధించారు. శనివారం జరిగిన తుదిపోరులో ప్రత్యర్థి కరీంనగర్ జిల్లా జట్టును 14-5 గోల్స్ తేడాతో ఓడించారు. మెరుగైన ఆటతీరును కనబరిచి క్రీడాకారిణులకు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఫణిరాజా అభినందనలు తెలియజేశారు.

కుస్తీ పోటీల్లో ప్రతిభ

ఆదిలాబాద్ క్రీడావిభాగం: నారాయణపేటలో నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కుస్తీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. అండర్-14, 17, 19 ఏళ్ల విభాగం ఆయా బరువుల కేటగిరీల్లో 4 పసిడి, 2 రజతాలు, 7 కాంస్య పతకాలు సాధించారు. పసిడి పతకం సాధించిన వారిలో పి.నైతిక, సీహెచ్. సహారా, ఎం.స్పందన, డి.శాలిని ఉన్నారు. భువనేశ్వరి, కె.శ్రీజ రజత పతకాలు సాధించారు. ఆర్.అనూష, ఎస్.నందిత, బి.వైష్ణవి, జె.పావని, ఈశ్వరి, కె.శ్రీవల్లి, పి.సహస్ర కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు.



రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో పతకాలు సాధించిన ఉమ్మడి జిల్లా విద్యార్థులు

నవోదయలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కాగజ్‌నగర్: పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతిలో ఖాళీగా ఉన్న ఏడు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కొడాలి పార్వతి తెలిపారు. 11వ తరగతిలో ప్రవేశాలకు సైతం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, విద్యాసంవత్సరం ప్రారంభం అనంతరం ఖాళీల వివరాలను వెల్లడిస్తామన్నారు. ఈ నెల 30వ తేదీలోపు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, వచ్చే ఏడాది ఫిబ్రవరి 8న ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు. 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 7తో గడువు ముగియనుందని, అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.